సాక్షి

విజయనగరం

గురువారం । 28 । సెప్టెంబర్ । 2023



గడపముంగిటకే ఫోర్టిఫైడ్ బియ్యం

పేద, బడుగు, బలహీన వర్గాలకు ప్రభుత్వం బలవర్ధక బియ్యాన్ని ఉచితంగా సరఫరా చేస్తోంది.

- 8లో



ప్రత్యేక కమిటీ పరిశీలన

కొత్తవలస మండల కేంద్రంలోని కోటపాడు బీసీ బాలికల హాస్టల్ తరలింపును అధికారులు పరిశీలించారు.

- 8లో



ప్రజావినతుల పరిష్కారమే లక్ష్యం

ప్రజావినతుల పరిష్కారానికి ప్రభుత్వం అధిక ప్రాధాన్యం ఇస్తోందని కలెక్టర్ నాగలక్ష్మి అన్నారు.

- 8లో

న్యూస్‌రీల్

29న చీపురుపల్లిలో 'జగనన్నకు చెబుదాం'

చీపురుపల్లి: స్థానిక మండల పరిషత్ కార్యాలయం ఆవరణలో ఈ నెల 29న ఉదయం 10 గంటలకు కలెక్టర్ నాగలక్ష్మి ఆధ్వర్యంలో 'జగనన్నకు చెబుదాం' కార్యక్రమం నిర్వహించనున్నట్టు ఎంపీడీఓ కె.రామకృష్ణంరాజు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా స్థాయి అధికారులతో జరిగే గ్రీవెన్స్‌ను ఈ ప్రాంత ప్రజలందరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

తెలంగాణ టెట్‌లో టాప్‌టెన్‌లో శ్రీరామ్



వెంకటనాగ శ్రీరామ్

విజయనగరం అర్బన్: తెలంగాణ ఉపాధ్యాయ అర్హత పరీక్ష (టెట్)–2023 ఫలితాల్లో విజయనగరం పట్టణానికి చెందిన కొల్లూరు వెంకటనాగశ్రీరామ్ టాప్‌టెన్‌లో నిలిచాడు. 150 మార్కులకు పేపర్–1లో 123 మార్కులు, పేపర్–2లో 124 మార్కులు సాధించాడు. గత ఏడాది నిర్వహించిన తెలంగాణా టెట్ ఫలితాల్లో కూడా పేపర్–2లో 130 మార్కులతో టాప్‌టెన్‌లో నిలిచాడు. ఏపీపీఎస్సీ నిర్వహించిన సచివాలయ సిబ్బంది పరీక్షలో జిల్లా టాపర్‌గా నిలిచి వెల్ఫేర్ అసిస్టెంట్ ఉద్యోగానికి ఎంపికయ్యాడు. ఉపాధ్యాయ వృత్తిపై ఉన్న మక్కువతో ఉద్యోగానికి రాజీనామా చేశాడు. 2018లో బీటెక్ పూర్తి చేసిన శ్రీరామ్ ఉపాధ్యాయ వృత్తిపై మమకారంతో బీఈడీ పూర్తిచేశాడు. లక్ష్యసాధనకు తాతయ్య నాగేశ్వరరావు, అమ్మమ్మ కుసుమకుమారి సహకరిస్తున్నారని శ్రీరామ్ తెలిపాడు.

పోలీసుల సంక్షేమానికి కృషి



కార్పస్‌ఫండ్ కింద రూ.లక్ష చెక్కును పార్వతికి అందజేస్తున్న అదనపు ఎస్పీ అస్మాఫర్హీన్

విజయనగరం క్రైమ్: జిల్లా పోలీసుల సంక్షేమానికి కృషిచేస్తున్నామని జిల్లా అదనపు ఎస్పీ అస్మాఫర్హీన్ తెలిపారు. జిల్లా పోలీస్ శాఖలో ఏఎస్ఐగా పనిచేస్తూ, ఇటీవల మృతిచెందిన ఎస్.వి.రమణ సతీమణి పార్వతికి ప్రభుత్వం మంజూరు చేసిన కార్పస్‌ఫండ్ రూ.లక్ష చెక్కును జిల్లా పోలీస్ కార్యాలయంలో బుధవారం ఆమె అందజేశారు. కార్యక్రమంలో ఆఫీస్ సూపరింటెండెంట్ కామేశ్వరరావు పాల్గొన్నారు.

వేంకటేశ్వరస్వామికి పుష్పార్చన



వెండి మండపం వద్ద పూజలు చేస్తున్న అర్చకులు

నెల్లిమర్ల రూరల్: సుప్రసిద్ధ పుణ్యక్షేత్రం రామతీర్థం సీతారామస్వామి దేవస్థానంలో వేంకటేశ్వర స్వామి బ్రహ్మోత్సవాలను పురస్కరించుకొని బుధవారం రాత్రి శ్రీవారికి పుష్పార్చన కార్యక్రమాన్ని అర్చకులు శాస్త్రోక్తంగా జరిపారు. ఆలయంలోని వెండి మండపం వద్ద విష్వక్సేనారాధన, పుణ్యాహవచనం తదితర కార్యక్రమాలను నిర్వహించారు. అనంతరం సహస్రనామాలు, వేద మంత్రాలను పఠిస్తూ వివిధ రకాలు పుష్పాలతో శ్రీవారికి అర్చన చేశారు. ద్వాదశ ఆరాధన, సప్తావరణ సేవను జరిపించి స్వామిని ప్రత్యేక పల్లకిలో ఊరేగించారు. తరువాత వేంకటేశ్వరస్వామికి పవళింపు సేవ జరిపారు. కార్యక్రమంలో దేవస్థానం ఈఓ కిషోర్‌కుమార్, అర్చకులు సాయిరామాచార్యులు, నరసింహాచార్యులు, భక్తులు పాల్గొన్నారు.

పునరావృతమైతే చర్యలు తప్పవు

విజయనగరం అర్బన్: జిల్లాలోని వివిధ స్థాయి విద్యాశాఖ అధికారుల తీరు అవమానకరం.. పాఠశాలలపై పర్యవేక్షణ లోపించింది.. ఇదే చివరి అవకాశం.. మరోసారి పునరావృతమైతే తొలగింపు చర్యలు తప్పవని విద్యాశాఖ ముఖ్య కార్యదర్శి ప్రవీణ్ ప్రకాష్ బుధవారం జారీచేసిన మెమోలో పేర్కొన్నారు. ఇటీవల జిల్లా పర్యటనలో తనిఖీలు చేసిన రెండు పాఠశాలల్లోని విద్యార్థుల అభ్యసనా సామర్థ్యాలు, ఉపాధ్యాయుల బోధన ప్రమాణాలను విశ్లేషిస్తూ ఆర్‌జేడీ, డీఈఓ, డిప్యూటీఈఓ, ఎంఈఓలకు ఈ మేరకు మెమోలు జారీచేశారు. పాఠశాలలు ప్రారంభించి 100 రోజులు పూర్తయ్యాయి.. ఇప్పటికీ విద్యార్థుల అభ్యసనా సామర్థ్యాలు మెరుగుపడలేదంటే.. క్షేత్రస్థాయిలో ఏ ఒక్క విద్యాధికారి సక్రమంగా పనిచేయడంలేదని భావించాల్సి వస్తోందన్నారు. ప్రతి పాఠశాలను నెలకు కనీసం 5 నుంచి 6 పర్యాయాలు సందర్శించి నివేదికలు అందజేయాల్సి ఉన్నా ఏ ఒక్కరూ పట్టించుకోవడంలేదన్నారు. మరోసారి ఈ పరిస్థితి తలెత్తితే సీసీఏ నిబంధనల మేరకు ఉద్యోగాల నుంచి రిమూవ్ ఆదేశాలిస్తానని హెచ్చరించారు.

పైడితల్లి ఆలయ విస్తరణకు...

శ్రీకారం

- విజయనగరంలో అమ్మవారి చదురుగుడికి కొత్త రూపు
- శరవేగంగా విస్తరణ పనులు
- ఆలయం చుట్టూ ఉన్న దుకాణాల తొలగింపు
- దుకాణదారులకు ప్రత్యామ్నాయంగా స్థలం కేటాయింపు
- సిరిమానోత్సవం నాటికి ఆలయం చుట్టూ చదునుచేసే పనులు
- భక్తులకు సౌకర్యంగా క్యూల ఏర్పాటు
- అభివృద్ధి పనులను పర్యవేక్షిస్తున్న అధికారులు, పాలకులు

సాక్షి ప్రతినిధి, విజయనగరం:

ఉత్తరాంధ్రుల ఆరాధ్య దైవంగా.. విజయనగరం వాసుల ఇలవేల్పుగా పైడితల్లి అమ్మవారు ప్రసిద్ధి. విజయనగరంలో ఆమెకున్న రెండు ఆలయాల్లో రైల్వే స్టేషన్ ఎదురుగా ఉన్న వనంగుడిని ఇప్పటికే అభివృద్ధి చేశారు. మూడులాంతర్ల కూడలి నుంచి గంటస్తంభం రోడ్డులో ఉన్న చదురుగుడి ఇన్నాళ్లూ ఎలాంటి అభివృద్ధికి నోచుకోలేదు. కేవలం 146 చదరపు గజాల విస్తీర్ణంలోని చిన్న ఆలయంలోనే నిత్యపూజాక్రతువులన్నీ జరుగుతున్నాయి. యాగాలు, ప్రత్యేక పూజలు, ముఖ్యంగా సిరిమానోత్సవం సమయంలో భక్తుల తాకిడికి తగ్గట్టుగా సదుపాయాలు కల్పించలేని పరిస్థితి. ఈ నేపథ్యంలో అమ్మవారికి ఆలయ విస్తరణకు ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. మాస్టరు ప్లాన్, ఆగమశాస్త్రం ప్రకారం విస్తరణ పనులు ప్రారంభించింది.

ప్రత్యామ్నాయ ఏర్పాట్లు పూర్తి...

ఆలయాన్ని విస్తరించాలంటే చుట్టూ ఉన్న కొన్ని దుకాణాలను తొలగించాల్సి ఉంది. ఆయా భవనాల యజమానులకు ప్రత్యామ్నాయంగా ఇచ్చేందుకు ఆలయానికి ఎదురుగానున్న ఎడ్వర్డ్ ఆస్పత్రి స్థలాన్ని ఆలయ అధికారులు ఎంపిక చేశారు. దీన్ని పురపాలక శాఖ నుంచి దేవదాయ శాఖ రూ.1.19 కోట్లకు కొనుగోలు చేసింది. విస్తరణలో ఏడు దుకాణాలను తొలగిస్తున్నారు. వాటిని నష్టపోతున్న యజమానులు తమకు కేటాయించిన స్థలంలో ఇప్పటికే దుకాణాల నిర్మాణ పనులు పూర్తి చేసుకున్నారు. దీంతో ఆలయ చుట్టు దుకాణాల కూల్చివేత పనులను ఆలయ కార్య నిర్వహణాధికారి కేఎల్ సుధారాణి ఇప్పటికే ప్రారంభించారు. ఆ పనులు ప్రస్తుతం శరవేగంగా జరుగుతున్నాయి.

మాస్టర్ ప్లాన్ ప్రకారం కొత్తరూపు...

చదురు గుడి పైకప్పు, గర్భగుడి, యాగశాల సహా



పొక్లెయిన్‌తో ఆలయం చుట్టూ ఉన్న భవనాల తొలగింపు ఇలా...



ఆలయ ప్రాంతంలో అభివృద్ధి పనులు

అన్నీ మార్పు చేయాల్సి ఉంది. దుకాణాల తొలగింపు వల్ల ఆలయానికి తూర్పు వైపున 185 చదరపు గజాలు, పశ్చిమ దిశలో 220 చదరపు గజాల స్థలం కలిసివస్తుంది. ప్రస్తుతమున్న 146 చదరపు గజాలతో కలిపితే దాదాపుగా 551 చదరపు గజాల స్థలం ఉంటుంది. దీన్ని బట్టి మాస్టర్ ప్లాన్‌ను రూపొందించాలని అధికారులు భావిస్తున్నారు.

భక్తులు ఇబ్బందులు తొలగేలా...

ప్రతీ నెలా అమ్మవారికి చండీయాగం చేయడం ఆనవాయితీ. దీన్ని ఆలయ ప్రవేశ ద్వారం వద్దనే నిర్వహించడం వల్ల ఆ సమయంలో భక్తుల రాకపోకలకు ఇబ్బందులు ఎదురవుతున్నాయి. గర్భగుడి కూడా చిన్నదిగా ఉండడం వల్ల కనీసం ఇద్దరు ముగ్గురు నిలబడాలన్నా ఇబ్బందే అవుతోంది. మాస్టర్ ప్లాన్ ప్రకారం ఆలయాన్ని విస్తరిస్తే ఆ ఇబ్బందులన్నీ తొలగిపోతాయి. హోమ గుండం పెట్టడానికి యాగశాలను విస్తరించవచ్చు. అలాగే అమ్మవారి అన్ని రకాల ప్రసాదాలను ఆలయం వద్దనే తయారుచేసేలా ప్రసాదశాల ఉండేలా ప్లాన్ చేస్తున్నారు.

సిరిమానోత్సవం ఏర్పాట్లుకు అవకాశం...

ఏటా దసరా మరుసటి మంగళవారం ఎంతో అట్టహాసంగా నిర్వహించే సిరిమానోత్సవానికి లక్షలాది మంది భక్తులు తరలివస్తుంటారు. ఈసారి సిరిమానోత్సవం నాటికి దుకాణాల తొలగింపు ప్రక్రియ పూర్తి చేయనున్నారు. స్థలం చదును చేసి అందులో క్యూలైన్లు ఏర్పాటు చేయాలని యోచిస్తున్నారు. దీనివల్ల క్యూలైన్ల పొడవు తగ్గుతుంది. అమ్మవారి శీఘ్ర దర్శనానికి భక్తులకు అవకాశం ఏర్పడుతుంది.

ఆగమశాస్త్రం ప్రకారమే విస్తరణ...



ఆగమశాస్త్రం ప్రకారం స్థపదుల సూచనలతో వాస్తుననుసరించి రూపొందించే ప్లాను ప్రకారమే ఆలయ విస్తరణ పనులు చేపడతాం. అదనంగా స్థలం కలిసొచ్చిన దృష్ట్యా ఆలయాన్ని కొద్దిగా పెంచితే బాగుంటుందనే అభిప్రాయాలు భక్తుల నుంచి వస్తున్నాయి. పార్కింగ్ కూడా ఆలయం వద్దే ఉండాలని ఆలోచిస్తున్నాం. ఆలయ విస్తరణతో భక్తుల రాక మరింత పెరుగుతుంది. ఆదాయం కూడా పెరుగుతుంది. తద్వారా ఆలయాన్ని ఇంకాస్త అభివృద్ధి చేసుకోవడానికి అవకాశం ఏర్పడుతుంది. ప్రస్తుతం విస్తరణ పనులు శరవేగంగా జరిగేలా చర్యలు తీసుకున్నాం.

– కె.ఎల్.సుధారాణి, కార్యనిర్వహణాధికారి, పైడితల్లి అమ్మవారి ఆలయం

29న వైఎస్సార్‌సీపీ జిల్లా విస్తృత స్థాయి సమావేశం

- జెడ్పీ చైర్మన్, పార్టీ జిల్లా అధ్యక్షుడు మజ్జి శ్రీనివాసరావు



విజయనగరం: వైఎస్సార్ సీపీ విజయనగరం జిల్లా విస్తృత స్థాయి సమావేశం ఈ నెల 29న నిర్వహించనున్నట్టు పార్టీ జిల్లా అధ్యక్షుడు, జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు బుధవారం తెలిపారు. ఆ రోజు ఉదయం 10 గంటలకు పూల్‌బాగ్ ప్రాంతంలోని జగన్నాథ ఫంక్షన్ హాల్‌లో సమావేశం నిర్వహిస్తామన్నారు. జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం విజయవంతం చేయడం, ఆంధ్రప్రదేశ్‌కు జగన్ ఎందుకు కావాలనే కార్యక్రమాలను ప్రజల్లోకి బలంగా తీసుకెళ్లేందుకు అనుసరించాల్సిన విధివిధానాలపై పార్టీ పెద్దలు దిశానిర్దేశం చేస్తారన్నారు. సమావేశంలో పార్టీ రీజనల్ కో ఆర్డినేటర్ వై.వి.సుబ్బారెడ్డి, విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణ, డిప్యూటీ సీఎం పీడిక రాజన్నదొర, డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామితో పాటు ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ఎంపీలు పాల్గొంటారన్నారు. జెడ్పీటీసీ సభ్యులు, ఎంపీపీలు, వైస్ ఎంపీపీలు, వివిధ కార్పొరేషన్‌ల చైర్మన్‌లు, డీసీసీబీ, డీసీఎంఎస్ చైర్మన్‌లు, మున్సిపల్, ఏఎంసీ చైర్మన్‌లు, మాజీ ఎమ్మెల్యేలు, పార్టీ కార్యవర్గ సభ్యులు, పార్టీ మండలాధ్యక్షులు, రాష్ట్ర/ జిల్లా పార్టీ అనుబంధ విభాగాల అధ్యక్షులు, సభ్యులు, జేసీఎస్ మండల కన్వీనర్లు, నియోజకవర్గ స్థాయి సోషల్ మీడియా కన్వీనర్లు, ఇతర ముఖ్యనాయకులు హాజరుకావాలని కోరారు.

అవకాశాన్ని అందిపుచ్చుకోండి

- ఇంటర్మీడియట్ ఆర్ఐఓ ఆదినారాయణ



పోస్టర్లను ఆవిష్కరిస్తున్న ఆర్ఐఓ, వివిధ కళాశాలల ప్రిన్సిపల్స్

విజయనగరం అర్బన్: ఇంటర్మీడియట్‌లో ఫెయిలైన విద్యార్థులకు రెగ్యులర్ విద్యార్థులతో కలిసి చదువుకునేందుకు ప్రభుత్వం కల్పించిన అవకాశాన్ని అందిపుచ్చుకోవాలని ఇంటర్మీడియట్ బోర్డు ప్రాంతీయ అధికారి మజ్జి ఆదినారాయణ సూచించారు. ఆర్ఐఓ కార్యాలయంలో వివిధ కళాశాలల ప్రిన్సిపాళ్లతో బుధవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎలాంటి అపరాధ రుసుము లేకుండా పరీక్షఫీజు చెల్లించుకునేందుకు ప్రభుత్వం గడువు పెంచిందన్నారు. అన్ని యాజమాన్యాల పరిధిలో చదివిన విద్యార్థులకు ఇది వర్తిస్తుందన్నారు. చదువు మధ్యలో ఆపకుండా స్కిల్ హబ్స్/స్కిల్ డెవలప్‌మెంట్ /ఏపీఎస్ఎస్‌డీసీ/ఎస్ఈఈడీఏపీ నడిపే స్కిల్ కాలేజెస్‌లో చేరవచ్చన్నారు. అనంతరం ప్రచార పోస్టర్‌ను విడుదల చేశారు. కార్యక్రమంలో డీవీఈఓ సురేష్‌కుమార్ పాల్గొన్నారు.

అమ్మో.. భూకంపం..!

బొబ్బిలి/రామభద్రపురం/సాలూరు: సాలూరు, బొబ్బిలి నియోజకవర్గాల్లోని పలు మండలాల్లో మధ్యాహ్నం 1.30 నుంచి 2 గంటల మధ్య స్వల్ప భూ ప్రకంపనలు అలజడి రేపాయి. భూమి కంపించడంతో జనం ఉలిక్కిపడ్డారు. ఇళ్ల నుంచి బయటకు పరుగు తీశారు. సాలూరు, రామభద్రపురం, పాచిపెంట మండలాలతో పాటు బొబ్బిలిలోని పాతబొబ్బిలి, గొడవీధి, నాయుడు కాలనీ, ఇందిరమ్మ కాలనీ, పూల్‌భాగ్, గొల్లవీధి, గొల్లపల్లి ప్రాంతాల్లో భూమి కంపించింది. రెండు సెకన్ల పాటు భూమి కదలడంతో ఇంటిలోని సన్‌షేడ్‌లపై ఉన్న వస్తువులు కిందపడ్డాయని పలువురు చెప్పారు. 20 ఏళ్ల కిందట ఇలా స్వల్పంగా భూమి కంపించిందని, మళ్లీ ఇప్పుడు స్వల్ప ప్రకంపనలు వచ్చినట్టు ఈ ప్రాంతీయులు చెబుతున్నారు. భూప్రకంపనలు రిక్టర్ స్కేల్‌పై 3.4గా నమోదయ్యాయి.

'ఉపాధి' కల్పించే స్థాయికి మహిళలు ఎదగాలి

- డీఆర్‌డీఏ పీడీ కల్యాణ చక్రవర్తి
- రుణవితరణ మహోత్సవంలో రుణాల పంపిణీ



పొదుపు సంఘాలకు రుణాల చెక్కులు అందజేస్తున్న బ్యాంకు అధికారులు

విజయనగరం అర్బన్: స్వయం ఉపాధి పొందుతూ మరో పదిమందికి ఉపాధి కల్పించే స్థాయికి మహిళలు ఎదగాలని వైఎస్సార్ క్రాంతి పథం, డీఆర్‌డీఏ ప్రాజెక్టు డైరెక్టర్ ఎ.కళ్యాణచక్రవర్తి పిలుపునిచ్చారు. వివిధ సంస్థల ద్వారా తీసుకున్న రుణాలను సద్వినియోగం చేసుకుని ఆర్థిక స్వావలంబన సాధించాలని కోరారు. లీడ్‌బ్యాంకు ఆధ్వర్యంలో విజయనగరం బీసీ కాలనీలోని ఎస్‌బీఐ గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణ సంస్థ (ఆర్‌సెట్)లో క్రెడిట్ అవుట్ రీచ్ క్యాక్రమంలో భాగంగా బుధవారం నిర్వహించిన రుణాల మంజూరు కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. గతంతో పోలిస్తే మహిళలు పొదుపు చేసే స్థాయి బాగా పెరిగిందని చెప్పారు. తీసుకున్న రుణాలను 99.7 శాతం తిరిగి చెల్లిస్తుండడంతో రుణపరపతి గణనీయంగా పెరిగిందన్నారు. ఇప్పుడు ఒక్కో సంఘం రూ.20 లక్షల వరకు రుణాన్ని పొందే స్థాయికి చేరుకుందని చెప్పారు. మహిళల పొదుపుసొమ్ము వివిధ బ్యాంకుల వద్ద దాదాపు రూ.500 కోట్లు వరకు ఉందని తెలిపారు. మెప్మా పీడీ సుధాకరరావు మాట్లాడుతూ మహిళల రుణపరపతి గణనీయంగా పెరగడం వల్ల, రుణాలు ఇచ్చేందుకు బ్యాంకులు పోటీ పడుతున్నాయన్నారు. వివిధ యూనిట్ల ఏర్పాటుకు రూ.2 కోట్ల వరకు రుణం తీసుకునే వెసులబాటు ఉందన్నారు. లీడ్‌బ్యాంకు జిల్లా మేనేజర్ ఎ.శ్రీనివాసరావు మాట్లాడుతూ బ్యాంకు రుణాలు అందరికీ అందాలన్న ఉద్దేశంతో అవుట్ రీచ్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని చెప్పారు. ప్రస్తుతం బ్యాంకులు అందిస్తున్న రుణాల్లో సుమారు 20 శాతం మహిళా సంఘాలకే అందుతున్నాయని చెప్పారు. అనంతరం ఎస్‌బీఐ, యూనియన్ బ్యాంకులు మంజూరు చేసిన రుణాల మెగా చెక్కులను అందజేశారు. కార్యక్రమంలో ఎస్‌బీఐ ఆర్‌ఎం విజయ్‌సుబ్రహ్మణ్యం, నాబార్డు డీడీఎం నాగార్జున, డీఆర్‌డీఏ ఏపీడీ సావిత్రి, పరిశ్రమలశాఖ ఏడీ వంశీకృష్ణ, ఆర్‌సెట్ డైరెక్టర్ రమణ, ఏఎల్‌డీఎం ప్రత్యూష, వివిధ బ్యాంకుల బ్రాంచ్ మేనేజర్లు, మహిళా సంఘాల సభ్యులు పాల్గొన్నారు.

ఆరోగ్య సిద్ధిరస్తు..!

- మాతాశిశు సంక్షేమానికి ప్రభుత్వం అధిక ప్రాధాన్యం
- అంగన్‌వాడీల ద్వారా పౌష్టికాహారం సరఫరా
- గర్భిణికి నెలకు రూ.1013లు, చిన్నారులకు రూ.500 విలువైన ఆహారపదార్థాలు
- జిల్లాలోని లబ్ధిదారులకు ఏడాదికి రూ.61.20 కోట్ల విలువైన పౌష్టికాహారం పంపిణీ



గాంధీనగర్ అంగన్‌వాడీ కేంద్రంలో లబ్ధిదారులకు గుడ్లు అందజేస్తున్న అంగన్‌వాడీ కార్యకర్త

విజయనగరం ఫోర్ట్: మాతా శిశు సంక్షేమానికి ప్రభుత్వం అధిక ప్రాధాన్యమిస్తోంది. ఆరోగ్యంగా ఎదిగేందుకు అవసరమైన పౌష్టికాహారాన్ని అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా సరఫరా చేస్తోంది. వైఎస్సార్ సంపూర్ణ పోషణ, వైఎస్సార్ సంపూర్ణ పోషణ ప్లస్ కింద పోషక విలువలతో కూడిన ఆహారాన్ని అందిస్తోంది. దీనికోసం ఏటా కోట్లాది రూపాయలు ఖర్చవుతున్నా... ఆరోగ్యమే భాగ్యంగా ముందుకు సాగుతోంది.

జిల్లాలో 88,535 మంది లబ్ధిదారులు

జిల్లాలో ఐసీడీఎస్ ప్రాజెక్టులు 11 ఉన్నాయి. వీటి పరిధిలో 2,499 అంగన్‌వాడీ కేంద్రాలు ఉన్నాయి. వీటిలో మెయిన్ అంగన్‌వాడీ కేంద్రాలు 2,206 కాగా, 293 మినీ అంగన్‌వాడీ కేంద్రాలు. వీటి పరిధిలో 88,535 మంది లబ్ధిదారులు ఉన్నారు. వీరిలో గర్భిణులు, బాలింతలు 18,228 మంది, 3 నుంచి 6 ఏళ్లలోపు పిల్లలు 25,562 మంది, 7 నెలల నుంచి 3 ఏళ్లలోపు పిల్లలు 44,745 మంది ఉన్నారు.

పౌష్టికాహారం సరఫరా ఇలా..

ఏడు నెలల నుంచి మూడేళ్లలోపు పిల్లలకు నెలకు సరిపడా రెండున్నర కేజీల బాలామృతం ప్యాకెట్, రెండున్నర లీటర్ల పాలు, 25 గుడ్లను ప్రభుత్వం సరఫరా చేస్తోంది. అలాగే, మూడేళ్ల నుంచి ఆరేళ్లలోపు పిల్లలకు ప్రతిరోజు అంగన్‌వాడీ కేంద్రాల్లో మధ్యాహ్న భోజనం వడ్డిస్తోంది. రోజుకు 100 మి.లీ పాలు, ఒక గుడ్డు ఇస్తుంది. నెలకు 3 కేజీల బియ్యం, కిలో కందిపప్పు, ఆయిల్ అర లీటరు, గుడ్లు 25, అటుకులు కేజీ, రాగి పిండి 2 కేజీలు, వేరుశనగ చక్కీలు పావుకేజీ, కర్జూరం పావుకేజీ, బెల్లం పావుకేజీ, 5 లీటర్ల పాలను సరఫరా చేస్తోంది.

నిధుల కేటాయింపు ఇలా..

గర్భిణులు, బాలింతలకు ప్రభుత్వం టేక్ హోమ్ రేషన్ (ఇంటివద్దకే రేషన్)ను నెలకు సరిపడా అందిస్తోంది. ఒక్కో లబ్ధిదారుకు నెలకు రూ.1013 చొప్పున ప్రభుత్వం వెచ్చిస్తోంది. 7 నెలల నుంచి 3 సంవత్సరాలలోపు పిల్లలకు సంబంధించి ఒక్కోలబ్ధిదారుకు నెలకు రూ.445 చొప్పున వెచ్చిస్తోంది. 3 నుంచి 6 సంవత్సరాలలోపు పిల్లలకు ఒక్కొక్కరికి నెలకు రూ.494 చొప్పున ఖర్చుచేస్తోంది.

ఏడాదికి రూ.61.20 కోట్ల కేటాయింపు

జిల్లాలోని అంగన్‌వాడీ కేంద్రాల పరిధిలో ప్రస్తుతం 88,535 మంది లబ్ధిదారులకు పౌష్టికాహారం పంపిణీ సాగుతోంది. దీనికోసం ప్రభుత్వం ఏడాదికి సుమారు రూ.61.20 కోట్లు కేటాయిస్తోంది. ఇందులో గర్భిణులు, బాలింతల కోసం ఏడాదికి రూ.22.15 కోట్లు, మూడేళ్ల నుంచి ఆరేళ్లలోపు పిల్లలకు ఏడాదికి రూ.15.15 కోట్లు, ఏడు నెలల నుంచి మూడేళ్లలోపు పిల్లలకు రూ.23.89 కోట్లు వెచ్చిస్తోంది.

ఆరోగ్యకర ఆహారం



పిల్లలు, గర్భిణులు, బాలింతల ఆరోగ్యం కోసం అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా పోషక విలువలతో కూడిన పౌష్టికాహారాన్ని ప్రభుత్వం అందిస్తోంది. వైఎస్సార్ సంపూర్ణ పోషణ, వైఎస్సార్ సంపూర్ణ పోషణ ప్లస్ కింద ఆహారం సరఫరాకు కోట్లాది రూపాయలు ఖర్చుచేస్తోంది. లబ్ధిదారులందరికీ ఆహారం సక్రమంగా అందేలా చర్యలు తీసుకుంటున్నాం.

– బి.శాంతకుమారి, జిల్లా స్త్రీ, శిశు సంక్షేమ అధికారి



బొండపల్లి మండలంలోని అంగన్‌వాడీ కేంద్రంలో భోజనం చేస్తున్న చిన్నారులు



తోటపాలెంలో పౌష్టికాహారం కిట్టును లబ్ధిదారులకు అందజేస్తున్న అంగన్‌వాడీ సిబ్బంది

సకాలంలో ఈ క్రాప్ నమోదు

బొండపల్లి:

ప్రస్తుత ఖరీఫ్ సీజన్‌లో రైతులు సాగుచేసిన వివిధ పంటల నమోదు ప్రక్రియను ప్రభుత్వం నిర్దేశించిన గడువులోగా పూర్తిచేయాలని వ్యవసాయశాఖ అధికారులకు కలెక్టర్ నాగలక్ష్మి సూచించారు. మండలంలోని గొట్లాం పంచాయతీ పరిధిలోని జియ్యన్నవలస, అంబటివలస గ్రామాల్లో ఈ క్రాప్ నమోదును క్షేత్రస్థాయిలో బుధవారం పరిశీలించారు. రైతులు, వ్యవసాయ సిబ్బందితో మాట్లాడారు. సాగుచేసిన వివరాలు ఈ క్రాప్‌లో నమోదైతేనే రైతులకు పెట్టుబడిసాయంతో పాటు విపత్తుల సమయంలో పరిహారం, పంటలకు మద్దతు ధర లభిస్తుందన్నారు. వ్యవసాయ సిబ్బందికి రైతులు సహకరించాలని కోరారు. కార్యక్రమంలో తహసీల్దార్ డీజీఎంఎస్ ప్రసాదరావు, మండల వ్యవసాయాధికారి పి.వి.మల్లికార్జునరావు, గొట్లాం పీఏసీఎస్ త్రిసభ్య కమిటీ చైర్మన్ మహంతి రమణ, వైఎస్సార్‌సీపీ జిల్లా నాయకులు మీసాల తులసీరాం, తదితరులు పాల్గొన్నారు.



జియ్యన్నవలసలో ఈ క్రాప్ నమోదును పరిశీలిస్తున్న కలెక్టర్ నాగలక్ష్మి

క్లుప్తంగా

సీఎంఏలో మెరిసిన విజయనగరం విద్యార్థిని


సాహితి వర్మ

విజయనగరం అర్బన్: జాతీయ స్థాయి సీఎంఏ (కాస్ట్ అండ్ మేనేజ్‌మెంట్ అకౌంట్స్) పరీక్షలో విజయనగరం పట్టణానికి చెందిన పాకలపాటి సాహితి వర్మ 47వ ర్యాంక్ సాధించింది. విద్యార్థినిని తల్లిదండ్రులతో పాటు బోధకులు అభినందించారు.

పురుగు మందు తాగి వ్యక్తి ఆత్మహత్య


తమ్మన్న దొర మృతదేహం

బొండపల్లి: మద్యం తాగవద్దని భార్య మందలించినందుకు మనస్తాపానికి గురై ఇంట్లో ఉన్న పురుగు మందు తాగి ఓ వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. బుధవారం జరిగిన ఈ సంఘటనపై ఎస్సై ఎస్.రవి తెలియజేసిన వివరాలిలా ఉన్నాయి. మండలంలోని వెదురువాడ గ్రామానికి చెందిన చంపి తమ్మన్నదొర(40) నిత్యం మద్యం తాగి ఇంటికి వచ్చి కుటుంబసభ్యులతో గొడవ పడుతుండడంతో భార్య మందలించింది. దీంతో పురుగు మందు తాగి అపస్మారక స్థితికి చేరుకోవడంతో 108 వాహనంలో గజపతినగరంలోని ప్రభుత్వ కమ్యూనిటీ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు.

కొత్తవలసలో మరొకరు..


భాస్కర్‌రావు (ఫైల్)

కొత్తవలస: మండల కేంద్రంలోని సాయినగర్ కాలనీలో నివాసముంటున్న ఒమ్మి భాస్కర్ రావు (36) పురుగు మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ సంఘటనపై సీఐ వి.చంద్రశేఖర్ తెలియజేసిన వివరాలిలా ఉన్నాయి. భాస్కర్‌రావు వడ్రంగి పని చేస్తూ కుటుంబాన్ని పోషించుకుంటున్నారు. కాగా ఇటీవల ఇంట్లో జరిగిన కొన్ని పరిణామాలకు తోడు ఆర్థిక ఇబ్బందులతో మనస్తాపం చెంది మంగళవారం మధ్యాహ్నం మద్యంలో బొద్దింకల మందు కలిపి ఇంటి వద్దే తాగేశాడు. దీంతో వాంతులు ఎక్కువగా అవడంతో చెంతనే ఉన్న సోదరుడు అనిల్ అడగ్గా పురుగు మందు తాగినట్లు తెలిపాడు. వెంటనే మండల కేంద్రంలో గల ప్రైవేట్ ఆస్పత్రిలో ప్రథమ చికిత్స నిర్వహించి విశాఖ కేజీహెచ్‌కు సోదరుడు అనిత్ తరలించగా చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందాడు. మృతుడికి భార్య లక్ష్మి, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. భార్య లక్ష్మి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

29న 305 క్వింటాళ్ల పీడీఎస్ బియ్యం వేలం

తెర్లాం: తెర్లాంలోని ఎంఎల్ఎస్ పాయింట్ వద్ద ఈ నెల 29న ఉదయం 11గంటలకు వివిధ ప్రాంతాల్లో 6ఎ కేసుల్లో సీజ్ చేసిన 305 క్వింటాళ్ల పీడీఎస్ బియ్యాన్ని వేలం వేయనున్నట్లు తహసీల్దార్ డి.రత్నకుమార్ చెప్పారు. జిల్లా జాయింట్ కలెక్టర్ ఆదేశాల మేరకు బుధవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. శుక్రవారం నిర్వహించనున్న పీడీఎస్ బియ్యం వేలంలో జిల్లాలోని ఏ మండలానికి చెందిన వ్యక్తులైనా పాల్గొన వచ్చని తెలిపారు. ప్రస్తుతం బియ్యం నిల్వలు స్థానిక ఎంఎల్ఎస్ పాయింట్‌లో ఉన్నాయని, ఎవరైనా వెళ్లి పరిశీలించుకోవచ్చన్నారు. వేలంలో పాల్గొనదలచిన వారు రూ.2వేలు ధరావత్తు చెల్లించాలని తెలియజేశారు. మరిన్ని వివరాలకు తననైనా, జిల్లా పౌర సరఫరాల శాఖ అధికారినైనా నేరుగా సంప్రదించవచ్చని సూచించారు.

యువజనోత్సవంలో క్విజ్ పోటీలు


క్విజ్ పోటీల్లో నగదు బహుమతులు గెలుచుకున్న టీమ్‌లతో నిర్వాహకులు

విజయనగరం ఫోర్ట్: జాతీయ ఎయిడ్స్ నియంత్రణ కార్యక్రమంపై యువతలో అవగాహన కల్పించేందుకు నిర్వహిస్తున్న యువజనోత్సవ కార్యక్రమాల్లో భాగంగా బుధవారం 8, 9 వ తరగతి చదువుతున్న విద్యార్థులకు జిల్లాస్థాయిలో క్విజ్ పోటీలను నిర్వహించారు. ఈ పోటీల్లో మండలానికి ఒక టీం(ముగ్గురు విద్యార్థులు) చొప్పున 26 మండలాల టీమ్‌లు పాల్గొన్నాయి. ఈ పోటీలను జిల్లా ప్రోగ్రాం అధికారి, జిల్లా ఎయిడ్స్ నివారణ, నియంత్రణ సంస్థ, జిల్లా విద్యాశాఖ సిబ్బందితో కలిసి కన్వీనర్ పి.బాలాజీ నిర్వహించారు. జిల్లా స్థాయి క్విజ్ పోటీలలో ప్రథమ స్థానంలో ప్రభుత్వ మహిళా ఉన్నత పాఠశాల, విజయనగరం టీమ్, రూ. 5000, ద్వితీయస్థానంలో ఏపీఎంఎస్, మదనాపురం, గంట్యాడ మండల టీమ్‌లు రూ. 4000, తృతీయ స్థానంలో జెడ్పీ ఉన్నత పాఠశాల కుమరాం, జామి మండలం టీమ్‌లు రూ.3000 గెలుచుకున్నాయి. వీరితో పాటు జెడ్పీ ఉన్నత పాఠశాల వల్లాపురం, గుర్ల మండల టీమ్ రూ.2000 నగదు బహుమతి గెలుచుకున్నాయి. జిల్లాస్థాయి క్విజ్ పోటీల్లో గెలుపొందిన వారికి పి.బాలాజీ, జిల్లా ప్రోగ్రాం అధికారి, జిల్లా ఎయిడ్స్ నివారణ, నియంత్రణ సంస్థ, టి.రాజేష్, జిల్లా ఎకడమిక్ కో ఆర్డినేటర్, పి.సన్యాసి రాజు, పీఎస్ఆర్ స్కూల్, కరస్పాండెంట్, ఎం.పద్మ, ప్రశంసా పత్రాలను అందజేశారు.

గడపముంగిటకే ఫోర్టిఫైడ్ బియ్యం

- ఎండీయూ వాహనాలతో రేషన్ పంపిణీ
- జిల్లాలో నెలకు 9,163 మెట్రిక్ టన్నుల బియ్యం సరఫరా


వర్షంలో కూడా పంపిణీ చేస్తున్న ఎండీయూ వాహనం

విజయనగరం అర్బన్: పేద, బడుగు, బలహీన వర్గాలకు ప్రభుత్వం నాణ్యమైన బియ్యాన్ని గడపగడపకు ఉచితంగా సరఫరా చేస్తోంది. పౌర సరఫరాల శాఖ ద్వారా చేపడుతున్న పంపిణీ వ్యవస్థ మధ్యస్థ సన్నరకం బియ్యాన్ని సార్టెక్స్ చేసి ఫోర్టిఫైడ్ బియ్యంగా మార్చి అందిస్తోంది. దీని వల్ల బియ్యంలో విటమిన్-బి12, ఫోలిక్ యాసిడ్, ఐరన్ వంటి పోషకాలు ప్రజలకు అందుతున్నాయి. బియ్యంతోపాటు పంచదార, నాణ్యమైన గోధుమ పిండి కూడా పంపిణీ చేస్తోంది. ప్రతి నెలలో తొలివారం రోజుల్లో అన్ని ప్రాంతాల్లో పంపిణీ జరిగేలా చర్యలు తీసుకుంటోంది. ఈ మేరకు జిల్లాలో జాతీయ ఆహార భద్రత చట్టం, రాష్ట్ర రేషన్ కార్డులకు కలిపి నెలకు 9,163 టన్నుల బియ్యం పంపిణీ జరుగుతోంది. బియ్యం పంపిణీపై సుమారు రూ.39.35 పైసలు ప్రభుత్వం రాయితీ కల్పించి ప్రజలకు కిలో రూ.1 కే అందిస్తోంది. జిల్లాలో 11 ఎంఎల్ఎస్ పాయింట్ల నుంచి 1,249 రేషన్ షాపులకు సరుకులు సరఫరా అవుతున్నాయి. రేషన్ షాపులకు చేరిన సరుకులను 370 ఎండీయు వాహనాల ద్వారా ప్రజల ఇళ్ల వద్దకే తీసుకువెళ్లి అందజేస్తున్నారు. దీని ద్వారా సరుకులు దారి తప్పకుండా పటిష్టమైన నిఘా ఉంటోంది. అంతేకాకుండా రేషన్ షాప్‌కు సరుకులు చేరిన సమయంలో ఒకసారి, నెల మధ్యలో మరోసారి, పంపిణీ ప్రక్రియ ముగిసిన తర్వాత మరోసారి గ్రామ రెవెన్యూ అధికారులతో తనిఖీలు చేస్తున్నారు. దీంతో అక్రమాలకు చెక్ పెట్టినట్లు అయింది. ఎండీయూ వాహనాల ద్వారా ప్రజా పంపిణీ జరిగే సమయంలో కూడా వీఆర్‌ఓలు, ఎన్‌ఫోర్స్‌మెంట్ సిబ్బంది తనిఖీ చేస్తున్నారు. పంపిణీలో వలంటీర్లు దగ్గర ఉండి ప్రజలకు సరుకులు అందేలా చూస్తున్నారు. లబ్ధిదారులు ఎక్కడైనా సరుకులు తీసుకునేలా ప్రభుత్వం చర్యలు చేపట్టింది. రేషన్ కార్డుదారు ఒకవేళ ఊరివెళ్తే వచ్చిన తర్వాత తీసుకునే వెసులుబాటు ఉంది. చిరు ఉద్యోగస్తులు సాయంత్రం వేళల్లో తీసుకునేలా రాత్రి 7 గంటల వరకూ సరఫరా ఉంటుందని పౌరసరఫరాల శాఖ అధికారులు చెబుతున్నారు.

అక్రమాలపై ప్రత్యేక దృష్టి

ప్రజలకు పంపిణీ చేసే రేషన్ సరుకుల అక్రమాలపై జేసీ మయూర్ అశోక్ దృష్టి సారించి ఉక్కుపాదం మోపారు. ప్రభుత్వం తలపెట్టిన విధంగా పేదలకు నాణ్యమైన బియ్యం, ఇతర సరుకులు సజావుగా అందేలా పక్కా ప్రణాళికలు అమలు చేస్తున్నారు. ఇందుకోసం ఎన్‌ఫోర్స్‌మెంట్‌ను ఏర్పాటు చేసి గడిచిన ఆరు నెలల్లో అక్రమాలకు పాల్పడిన పలు రేషన్ షాపులపై చర్యలు తీసుకున్నారు. అదే విధంగా ఏడాదిలో చేసిన దాడుల్లో 112 అక్రమ రవాణా కేసులు, నిల్వ చేసిన పీడీఎస్ బియ్యం తరలింపులపై 6ఎ కేసులు నమోదు చేశారు. కేసులు నమోదు చేయడంతోపాటు 1,873.6 క్వింటాళ్ల బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నారు. మొత్తం మీద జిల్లాలో పారదర్శకంగా ప్రజా పంపిణీ వ్యవస్థ అమలు చేసేలా చర్యలు పెంచారు. ఎన్‌ఫోర్స్‌మెంట్ డిప్యూటీ తహసీల్దార్లు రోజుకు కనీసం 3 రేషన్ షాపులు తప్పనిసరిగా తనిఖీ చేసేలా జాయింట్ కలెక్టర్ ఉత్తర్వులు జారీ చేశారు. నెల మొత్తంలో డీటీ పరిధిలోని అన్ని రేషన్ షాపులు తప్పనిసరిగా తనిఖీ జరిగేలా చర్యలు తీసుకుంటున్నారు.

అక్రమ రవాణాపై నిఘా



ప్రభుత్వం సంకల్పించినట్లు ప్రజా పంపిణీ వ్యవస్థ ద్వారా పేద, బడుగు, బలహీన వర్గాల ప్రజలకు పోర్టిఫైడ్ రేషన్ బియ్యం, ఇతర సరుకులు పక్కాగా అందేలా చర్యలు తీసుకుంటున్నాం. ఇందుకోసం ఎన్‌ఫోర్స్‌మెంట్ వ్యవస్థను ఏర్పాటు చేసి నిఘా ఉంచాం. జిల్లాలో ఎండీయూ వాహనాలతో కార్డుదారుల ఇంటి వద్దనే సరుకులు పంపిణీ చేస్తున్నాం. జిల్లాలో 90 శాతం దాటి ప్రతి నెలా రేషన్ పంపిణీ విజయవంతంగా జరుగుతోంది. రేషన్ బియ్యం, ఇతర సరుకుల్లో ఎవరు అక్రమాలకు పాల్పడినా కఠిన చర్యలతోపాటు అక్రమ రవాణా వాహనాలు, అక్రమాలకు పాల్పడిన మిల్లులు సీజ్ చేస్తాం.

– కె.మయూర్ అశోక్, జాయింట్ కలెక్టర్

ప్రజావినతుల పరిష్కారమే లక్ష్యం

- కలెక్టర్ నాగలక్ష్మి
- 115 వినతుల స్వీకరణ


వినతులను స్వీకరిస్తున్న కలెక్టర్ నాగలక్ష్మి

మెంటాడ(గజపతినగరం రూరల్): ప్రజావినతుల పరిష్కారానికి ప్రభుత్వం అధిక ప్రాధాన్యం ఇస్తోందని కలెక్టర్ నాగలక్ష్మి అన్నారు. ఈ మేరకు గజపతినగరం ఎంపీడీఓ కార్యాలయంలో బుధవారం నిర్వహించిన జగనన్నకు చెబుదాం కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా ఆమె పాల్గొని ప్రజల నుంచి 115 వినతులు స్వీకరించారు. ఆ వినతులను శాఖల వారీగా మండల అధికారులకు అందజేసి నిర్ణీత వ్యవధిలోగా పరిష్కారం చూపాలని ఆదేశించారు.అనంతరం అధికారులతో సమీక్షించి విలేకరులతో మాట్లాడారు. ప్రభుత్వం ప్రజావినతుల పరిష్కారానికి అధిక ప్రాధాన్యం ఇస్తోందని, సంబంధిత అధికారులు మండలస్థాయిలో పరిష్కరించాల్సిన అర్జీలను పరిష్కరించి జిల్లాస్థాయి వినతులను జిల్లా అధికారులకు అందజేయాలని సూచించారు. మండల స్థాయిలో అధికారుల సమన్వయంతో సమస్యలు శతశాతం పరిష్కారం అవుతాయన్నారు. తరచూ మండల స్థాయిలో ఎంపీడీఓ, తహసీల్దార్, ఎస్‌హెచ్‌ఓలతో ఏర్పాటుచేసిన కమిటీ ప్రత్యేక అధికారి ఆధ్వర్యంలో ఆయా సమస్యలపై చర్చించి పరిష్కారం చూపాలని చెప్పారు. ప్రజలు అందజేసిన వినతులను పరిష్కరించిన తరువాత వాటి పరిష్కారం తీరుపై జిల్లా స్థాయిలో ఆడిట్ జరుగుతుందన్నారు. గజపతినగరం మండలానికి సంబంధించి వినతుల పరిష్కారంలో సంతృప్తి వ్యక్తం చేసి అధికారుల బృందాన్ని కలెక్టర్ అభినందించారు. కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ మయూర్ అశోక్, ఆర్డీఓ శేషశైలజ, జెడ్పీ సీఈఓ రాజ్‌కుమార్, డీఆర్‌డీఏ పీడీ కల్యాణ్ చక్రవర్తి, ఎంపీడీఓ కిశోర్‌కుమార్, తహసీల్దార్ అరుణకుమారితో పాటు సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ప్రతిష్టాత్మకంగా వినతుల పరిష్కారం

- కలెక్టర్ నిషాంత్ కుమార్


అర్జీలను పరిశీలిస్తున్న కలెక్టర్ నిషాంత్‌కుమార్

పార్వతీపురం: జగనన్నకు చెబుదాం కార్యక్రమానికి ప్రజల నుంచి వచ్చిన వినతులను ప్రతిష్టాత్మకంగా తీసుకుని నాణ్యమైన పరిష్కారం చూపాలని పార్వతీపురం మన్యం జిల్లా కలెక్టర్ నిషాంత్ కుమార్ అన్నారు. ఈ మేరకు గరుగుబిల్లి మండల పరిషత్ కార్యాలయంలో జగనన్నకు చెబుదాం మండల స్థాయి కార్యక్రమాన్ని బుధవారం జిల్లా అధికారులతో కలిసి ఆయన నిర్వహించారు. ఈ సందర్భంగా మండల పరిధిలోని పలువురు అర్జీదారుల నుంచి కలెక్టర్, జాయింట్ కలెక్టర్ ఆర్.గోవిందరావు, ఆర్డీఓ కె.హేమలత 78 వినతులను స్వీకరించారు. భూ సమస్యలు పరిష్కరించాలని, సామాజిక పింఛన్లు పునరుద్ధరించాలని, ఇళ్ల స్థలాలు మంజూరు చేయాలని పలువురు అర్జీలను అందజేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ నిషాంత్‌కుమార్ మాట్లాడుతూ జగనన్నకు చెబుదాం కార్యక్రమానికి ప్రజల నుంచి వచ్చిన వినతులను క్షేత్రస్థాయిలో చిత్తశుద్ధితో పరిశీలించి సత్వర పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ఫిర్యాదులు అందించేందుకు జిల్లా కేంద్రానికి అర్జీదారులు రావాల్సిన పరిస్థితి తలెత్తకుండా మండలస్థాయిలో పరిష్కరించేలా ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించారు. కార్యక్రమంలో జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి బి.జగన్నాథ రావు, డీఆర్‌డీఏ ప్రాజెక్టు డైరెక్టర్ పి. కిరణ్ కుమార్, జిల్లా నీటి యాజమాన్య సంస్థ ప్రాజెక్ట్ డైరెక్టర్ కె. రామ చంద్ర రావు తదితర జిల్లా అధికారులు

ఏనుగుల సంచారంపై అప్రమత్తం

- జిల్లా అటవీశాఖాధికారిణి జీఏపీ ప్రసూన


జిల్లా అటవీశాఖాధికారిణి జీఏపీ ప్రసూన

పార్వతీపురంటౌన్: ఏనుగుల సంచారంపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని పార్వతీపురం మన్యం జిల్లా అటవీశాఖాధికారిణి జీఏపీ ప్రసూన తెలిపారు. ఈమేరకు బుధవారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఒంటరి ఏనుగు హరి కొమరాడ మండలం నడిమివలస కొండపై ఉందని, రాత్రి సమయాల్లో కొండ దిగువకు వస్తోందని, తెల్లవారు జామున కొండమీదకు వెళ్తోందని తెలిపారు. రేగులపాడు, పెదఖేర్జల, చినఖేర్జల, బుజిగవలస, నడిమివలస మెట్ట, కోటిపాం, జంఝావతి, కుమ్మరిగుంట, అర్తాం గ్రామ ప్రజలు సాయంత్రం, తెలవారు జామున పొలాలకు వెళ్లేటప్పుడు, ప్రయాణాలు సాగించినప్పుడు అప్రమత్తంగా ఉండాలని విజ్ఞప్తి చేశారు. ముందస్తు సమాచారాన్ని అటవీ అధికారుల నుంచి తీసుకోవాలని సూచించారు.

పెదమేరంగి కూడలి వద్ద ఏడు ఏనుగులు

ఏడు ఏనుగులు పెదమేరంగి కూడలి వద్ద రామినాయుడువలస గ్రామం సమీపంలో ఉన్నాయని తెలిపారు. ఏనుగులను అటవీశాఖ సిబ్బంది నిరంతరం పర్యవేక్షిస్తున్నారన్నారు.

పంటనష్టంపై చర్యలు

పంటనష్టంపై అటవీశాఖ చర్యలు తీసుకుంటుందని, సంబంధిత శాఖలను సమన్వయపరిచి నష్టపరిహారాన్ని అంచనా వేయడానికి ప్రయత్నిస్తున్నామని తెలిపారు. ఆస్తులకు సంబంధించి నష్టపరిహారం అంచనా విలువలు సంబంధిత తహసీల్దార్ కార్యాలయం నుంచి అందిన వెంటనే చెల్లింపులకు చర్యలు తీసుకుంటామని తెలిపారు. సంబంధిత రేంజ్ అధికారుల నుంచి నష్టపరిహారం పొందవచ్చునని పేర్కొన్నారు. హరి ఏనుగు సమాచారం కోసం ఉలిపిరి ఫారెస్ట్ బీట్ ఆఫీసర్ కె. సత్యనారాయణ ఫోన్ 9398468628నంబర్‌కు, మిగిలిన ఏనుగుల సమాచారానికి బోరి బీట్ ఆఫీసర్ ఎం.కిరణ్ ఫోన్ 9440595181 నంబర్లను సంప్రదించాలని సూచించారు.

చోరీకేసులో ఇద్దరు నిందితుల అరెస్ట్


స్వాధీనం చేసుకున్న బంగారు ఆభరణాలు, నగదు

విజయనగరం క్రైమ్: చోరీకేసులో ఇద్దరు నిందితులను అరెస్టు చేసి, వారి నుంచి బంగారం, నగదు స్వాధీనం చేసుకున్నట్లు టూటౌన్ సీఐ విజయానంద్ తెలిపారు. ఈ మేరకు బుధవారం ఆయన తెలిపిన వివరాలిలా ఉన్నాయి. ఈ నెల 17న రాత్రి ఫూల్‌బాగ్‌లోని పీవీజీనగర్‌లో బంగారు వస్తువులు తయారుచేసే పొన్నాడ అప్పలరాజు తన ఇంటికి తాళం వేసుకుని, అత్తవారింటికి విశాఖ వెళ్లి, తిరిగి రాత్రికి ఇంటికి వచ్చేసరికి ఇంటి తాళాలు పగులగొట్టి, బెడ్‌రూమ్‌లో బీరువా తాళాలు తెరిచి ఉన్నాయి. అందులో ఉన్న ఎనిమిదిన్నర తులాల బంగారు నగలు, నగదు చోరీ జరిగినట్లు గుర్తించి టూటౌన్ పోలీసులకు ఫిర్యాదుచేశాడు. ఫిర్యాదు మేరకు పోలీసులు విచారణ ప్రారంభించి బుధవారం సాయంత్రం నల్లచెరువు నాలుగురోడ్ల జంక్షన్ వద్ద అనుమానాస్పదంగా తిరుగుతున్న ఫూల్‌బాగ్ పీవీజీనగర్‌కు చెందిన పటాన్ అస్లామ్, షేక్ షాజన్‌లను అదుపులోకి తీసుకుని విచారణ చేసి వారి నుంచి ఎనిమిదిన్నర తులాల బంగారు వస్తువులు, బంగారు బిస్కెట్ ముక్కలు, రూ.ఆరు లక్షల నగదును రికవరీ చేశారు. నిందితులను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు.

హాకీ, తైక్వాండో క్రీడాకారుల ఎంపిక


అండర్-14 బాలుర విభాగంలో హాకీ ఎంపికలు నిర్వహిస్తున్న దృశ్యం


తైక్వాండో క్రీడాకారుల ఎంపిక పోటీల్లో తలపడుతున్న క్రీడాకారులు

విజయనగరం: క్రీడాకారులను ప్రోత్సహించడంలో భాగంగా రాష్ట్ర ప్రభుత్వం ప్రతి ఏడాది నిర్వహించే అండర్-14,17 బాల, బాలికల క్రీడా పోటీలకు ప్రతిభగల క్రీడాకారులను ఎంపిక చేస్తామని జిల్లా స్కూల్ గేమ్స్ అసోసియేషన్ కార్యదర్శి ఎల్‌వీ రమణ తెలిపారు. ఈ మేరకు బుధవారం అసోసియేషన్ ఆధ్వర్యంలో నగరంలోని రాజీవ్ క్రీడా మైదానం ప్రాంగణంలో అండర్-14 విభాగంలో బాల, బాలికలకు హాకీ పోటీలు, అండర్-14,17 బాల, బాలికల విభాగాల్లో తైక్వాండో పోటీలు నిర్వహించారు. హాకీ పోటీలకు 90 మంది బాల, బాలికలు హాజరుకాగా..వారిలో ప్రతిభ కనబరిచిన 18 మంది బాలురు, 18 బాలికలను రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపిక చేశామని అసోసియేషన్ కార్యదర్శి ఎల్‌వీ రమణ పేర్కొన్నారు. అలాగే తైక్వాండో పోటీలకు వివిధ పాఠశాలల నుంచి 150 మంది క్రీడాకారులు హాజరుకాగా..ఉత్తమ ప్రతిభకనబరిచిన వారిని జరగనున్న అంతర్ జిల్లాల పోటీలకు త్వరలో ఎంపిక చేయనున్నట్లు తెలిపారు. ఎంపిక ప్రక్రియను వ్యాయామ ఉపాధ్యాయులు రమేష్, సూర్యారావు, కృష్ణమోహన్, ప్రసాద్‌లతో పాటు తైక్వాండో కోచ్‌లు నాగరాజు తదితరులు పర్యవేక్షించారు.

రాష్ట్రస్థాయి పోటీలకు పాగిరి విద్యార్థులు


రాజాం సిటీ: విద్యార్థులను అభినందిస్తున్న హెచ్‌ఎం సత్యనారాయణ, పీడీ అజయ్‌కుమార్

రాజాం సిటీ: రాష్ట్రస్థాయి స్విమ్మింగ్, కబడ్డీ పోటీలకు మండల పరిధిలోని పాగిరి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు ఎంపికయ్యారని హెచ్‌ఎం శాసపు సత్యనారాయణ బుధవారం తెలిపారు. శ్రీకాకుళంలో ఈ నెల 25న స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన పోటీల్లో ఎం.లోకేష్ (కబడ్డీ), పి.నిష్వాత్ (బ్యాడ్మింటన్), కె.హాసిని, పి.బాలకృష్ణ (స్విమ్మింగ్) పోటీలకు ఎంపికయ్యారని పేర్కొన్నారు. ఎంపికైన విద్యార్థులను హెచ్‌ఎంతో పాటు పీడీలు అజయ్‌కుమార్, సంతోషిమాత, ఉపాధ్యాయులు అభినందించారు.


సంతకవిటి: రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థులతో హెచ్‌ఎం

హొంజరాం విద్యార్థులు కూడా..

సంతకవిటి: మండల పరిధిలోని హొంజరాం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారని హెచ్‌ఎం తమ్మినేని నీలంనాయుడు బుధవారం తెలిపారు. అండర్-14 బాలుర విభాగంలో బోడి ఉదయ్, లోలుగు ఆకాష్‌లు, బాలికల విభాగంలో ఆడింగి మధుప్రియ, చింతాడ పవిత్రలు త్రోబాల్ పోటీలకు ఎంపికయ్యారన్నారు. అండర్-17 బాలికల విభాగంలో చింతాడ పవిత్ర, కసింకోట రాజ్యలక్ష్మిలు ఎంపికైనట్లు తెలిపారు. వారిని హెచ్‌ఎంతోపాటు ఉపాధ్యాయులు అభినందించారు.

బీసీ బాలికల హాస్టల్ తరలింపుపై ప్రత్యేక కమిటీ పరిశీలన


బీసీ హాస్టల్ విద్యార్థినుల అభిప్రాయం అడిగి తెలుసుకుంటున్న కమిటీ సభ్యులు

కొత్తవలస: మండల కేంద్రంలోని కోటపాడు రోడ్డులో గల బీసీ బాలికల హాస్టల్ తరలింపుపై కలెక్టర్ ఆదేశాల మేరకు కమిటీ సభ్యులు బుధవారం పరిశీలించారు. ఈ హాస్టల్ స్థానిక హైస్కూల్‌కు దూరంగా ఉండడంతో విద్యార్థినులు రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. రైల్వే అండర్ బ్రిడ్జి దాటుకుంటూ, ట్రాఫిక్‌ను అధిగమించి హైస్కూల్‌కు రాకపోకలు చేస్తున్నారు. ఈ సమస్యను గత కలెక్టర్ సూర్యకుమారి దృష్టికి తీసుకెళ్లగా తక్షణమే ఈ హాస్టల్‌ను పోలీస్‌స్టేషన్ సమీపంలో గల సాంఘిక సంక్షేమ వసతి గృహంలోకి మార్చాలని అధికారులను ఆదేశించారు. అయితే నాటి ఆదేశాలు అమలు కాలేదు. దీంతో ప్రస్తుత కలెక్టర్ నాగలక్ష్మి హాస్టల్ తరలింపుపై సాధ్యాసాధ్యాలను పరిశీలించి నివేదిక సమర్పించాలని మండల ప్రత్యేకాధికారి వై.పాపారావు ఆధ్వర్యంలో కమిటీని ఏర్పాటు చేశారు. ఈ మేరకు కమిటీ సభ్యులు కోటపాడు రోడ్డులో గల బీసీ బాలికల హాస్టల్, పోలీస్‌స్టేషన్ సమీపంలో గల ఎస్సీ హాస్టల్ భవన సముదాయాలను, వసతి సౌకర్యాలను బుధవారం పరిశీలించారు. అలాగే జిల్లా పరిషత్ పాఠశాలలో విద్యార్థుల అభిప్రాయాలు సేకరించారు.

తరలింపు తగదు

ఇదిలా ఉండగా ఎస్సీ హాస్టల్ భవనంలోకి బీసీ హాస్టల్‌ను మార్చడం తగదని దీని వల్ల ఎస్సీ విద్యార్థులకు తీవ్రనష్టం కలుగుతుందని కమిటీ సభ్యులకు పలు దళిత సంఘాల నాయకులు వినతిపత్రం సమర్పించారు. కార్యక్రమంలో కమిటీ సభ్యులు ఎంపీపీ నీలంశెట్టి గోపెమ్మ, ఎంపీడీఓ వై.పద్మజ, జిల్లా బీసీ వెల్ఫేర్ అధికారి ఎం.యశోదనరావు, సోషల్ వెల్ఫేర్ డీడీ బి.రామానందం, హైస్కూల్ హెచ్‌ఎం చీపురుపల్లి ఈశ్వరరావు పాల్గొన్నారు.

లారీని ఢీకొని వ్యక్తి మృతి


గణేష్ మృతదేహం

రాజాం సిటీ: మండల పరిధి పాగిరి సమీపంలో మంగళవారం రాత్రి ఓ వ్యక్తి బైక్‌పై వస్తూ ఆగిఉన్న లారీని ఢీకొని మృతిచెందాడు. వివరాలిలా ఉన్నాయి. జి.సిగడాం మండలం పెంట గ్రామానికి చెందిన లావేటి గణేష్ (27) స్వగ్రామం నుంచి రాజాం ద్విచక్రవాహనంపై వస్తుండగా పాగిరి సమీపంలోని లెప్రసీ ఆస్పత్రి వద్ద రోడ్డుపై ఆగి ఉన్న లారీని ఢీకొట్టడంతో తలకు బలమైన గాయాలయ్యాయి. వెంటనే స్థానికులు రాజాంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతిచెందాడు. మృతుని సోదరుడు సంతోష్ ఫిర్యాదు మేరకు బుధవారం కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై పి.నీలావతి తెలిపారు.

నిప్పంటుకుని వృద్ధురాలు..


సీరమ్మ మృతదేహం

పార్వతీపురంటౌన్: చుట్ట ముట్టించుకుంటున్న సమయంలో చీర అంటుకుని ఓ వృద్ధురాలు మృతిచెందింది. ఈ సంఘటనపై జిల్లా అస్పత్రి అవుట్‌పోస్టు పోలీసులు బుధవారం తెలిపిన వివరాలిలా ఉన్నాయి. బలిజిపేట మండలంలోని గౌరీపురం గ్రామానికి చెందిన జె.సీరమ్మ (80) మంగళవారం చుట్ట ముట్టించుకుంటున్న సమయంలో ప్రమాదవశాత్తు చీర కొంగు ముట్టుకుని అగ్నిప్రమాదం జరిగింది. ఈ ఘటనలో ఆమె తీవ్రగాయాల పాలుకాగా కుటుంబసభ్యులు పార్వతీపురం జిల్లా ఆస్పత్రికి తరలించారు. వైద్యులు చికిత్స అందించినప్పటికీ శరీరం సహకరించకపోవడంతో బుధవారం ఆమె మృతిచెందిందని వైద్యులు నిర్ధారించారు. ఈ ఘటనపై అవుట్‌పోస్టు పోలీసులు కేసు నమోదు చేసి పోస్టుమార్టం నిర్వహించి మృతదేహాన్ని కుటుంబసభ్యులకు అందజేశారు.

చికిత్సపొందుతూ బాలుడు..


మృతిచెందిన బాలుడు నవీన్(ఫైల్)

బాడంగి: మండలంలోని గొల్లాది గ్రామానికి చెందిన వలసకూలీ కుటుంబంలో తల్లీకుమారులు చెన్నైలో జరిగిన రైలు ప్రమాదంలో ప్రాణాలు కోల్పోయారు. ఈ ప్రమాదానికి సంబంధించి గ్రామస్తులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. మండలంలోని గొల్లాది గ్రామానికి చెందిన నాయుడు అప్పన్న, భార్య మంగమ్మ(45), చెన్నైకి వలస వెళ్లారు. వారి పిల్లలు కుమారుడు నవీన్ (12), కుమార్తె దివ్య స్వగ్రామంలోనే చదువుకుంటున్నారు. గ్రామంలో చదువుతున్న పిల్లలు రెండునెలల క్రితమే తల్లితో చెన్నై వెళ్లారు. నవీన్ తల్లితో పాటు పనిలోకి వెళ్లి తిరిగివస్తుండగా రైలు ప్రమాదంలో ఇద్దరూ తీవ్రగాయాల పాలయ్యారు. తల్లి ప్రమాదస్థలంలోనే మృతి చెందగా నవీన్‌ను ఆస్పత్రిలో చేర్చారు. మంగమ్మ మృతదేహం బుధవారం గ్రామానికి చేరుకోగా అంత్యక్రియలు నిర్వహించారు. చెన్నైలోని ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతిచెందిన నవీన్ మృతదేహం గురువారానికి స్వగ్రామానికి చేరుకుంటుందని గ్రామస్తులు తెలిపారు.

29న అండర్-19 స్కూల్ గేమ్స్ ఫుట్‌బాల్ పోటీలు

విజయనగరం: రాష్ట్రస్థాయిలో జరగనున్న అండర్-19 స్కూల్‌గేమ్స్ ఫుట్‌బాల్ పోటీల్లో పాల్గొనబోయే జిల్లా క్రీడాకారుల ఎంపిక పోటీలు ఈనెల 29న నిర్వహించనున్నట్లు అండర్-19 స్కూల్ గేమ్స్ అసోసియేషన్ కార్యదర్శి పీవీఎల్ఎన్ కృష్ణ బుధవారం తెలిపారు. ఆ రోజు ఉదయం 10 గంటలకు విజయనగరం జిల్లా కేంద్రంలో గల రాజీవ్ క్రీడామైదానం ప్రాంగణంలో ఎంపిక పోటీలు ప్రారంభమవుతాయని పేర్కొన్నారు. 2005 జనవరి 1వ తేదీ అనంతరం జన్మించి ప్రస్తుతం విద్యనభ్యసిస్తున్న 8,9,10, ఇంటర్మీడియట్ విద్యార్థులు ఈ పోటీల్లో పాల్గొనవచ్చని పేర్కొన్నారు. అర్హత, ఆసక్తి గల క్రీడాకారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. మరిన్ని వివరాలకు ఫోన్ 9885111375 నంబర్‌ను సంప్రదించాలని సూచించారు.

చికెన్

బ్రాయిలర్		
లైవ్	డ్రెస్డ్	స్కిన్‌లెస్
₹130	₹230	₹ 240